డ్రంకన్ డ్రైవ్ కేసులే అధికం

- చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఈ ఏడాది 1,510 కేసుల నమోదు
- చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ ధరవత్ నానునాయక్

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఈ ఏడాది 1,510 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నగరం నడిబొడ్డున ఉన్న చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్ లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల పరిధిలోకి వచ్చే దాదాపు అనేక ప్రాంతాలు చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతంలో అనేక బార్లు, వైన్‌షాపులతోపాటు రద్దీగా ఉండే ప్రాంతాలు కావడంతో ఈ ఏడాది కేసులు విపరీతంగా నమోదయ్యాయి.

మైనర్ల డ్రైవింగ్, హెల్మెట్ లేనివారిపై కేసులు..

మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేసిన సందర్భాల్లో కేసులు బాగానే నమోదయ్యాయి. నమోదైన కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మైనర్ డ్రైవింగ్ కేసులు 96 నమోదు కాగా, లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న సందర్భాల్లో 2,18 కేసులు నమోదయ్యాయి. 41 సీపీ యాక్టు కింద 6,952 కేసులు నమోదు కాగా 39(బి)సీపీ యాక్టు కింద 5,41 కేసులు నమోదయ్యాయి. హెల్మెట్ లేకుండా ప్రయాణించేవారిపై 1,949 కేసులు నమోదయ్యాయి. పెండింగ్ చలాన్ల కింద చెల్లించినవి 89,467 కాగా ఎలాంటి అనుమతి లేకుండా నగరంలోకి ప్రవేశించిన 29 ఆటోలపై పీఎస్ పరిధిలో కేసులు నమోదయ్యాయి.



చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ ధరవత్ నానునాయక్

రోప్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కింద కేసులు నమోదు..

నగర పోలీసులు ఇటీవల ప్రవేశపెట్టి రోప్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కింద నమోదైన కేసుల వివరాలను చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ నానునాయక్ శనివారం వెల్లడించారు. ఫ్రీ లెఫ్ట్ బ్లాక్ కేసులు 7,88, స్టాఫ్‌లైన్ క్రాసింగ్ కేసులు 4,713, రాంగ్‌సైడ్ డ్రై వింగ్ కేసులు 5,961, ట్రిపుల్ రైడింగ్ కేసులు 1,227, మొబైల్ యాప్ కేసులు 322, ఫుట్‌పాత్ అక్రమణలపై 7 ఎఫ్ఐఆర్ కేసులు, నంబర్‌ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 13 కేసులు రిజిష్టర్ అయినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై సున్నితంగా వ్యవహరించాలి



అభ్యర్థులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో చేరే అభ్యర్థులు ప్రజా సమస్యలపై సున్నితంగా వ్యవహరించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ ఏడాది రెండు రాష్ట్రాల నుంచి అత్య.ధిక సంఖ్యలో సివిల్స్ అభ్యర్థులు విజేతలుగా తయారవ్వాలని , భవిష్యత్తులో ఇదే వరవడి కొనసాగాలని అభిలాషించారు. అశోక్‌నగర్‌లోని సివిల్ సర్వీసెస్ శిక్షణ సంస్థ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో శనివారం ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూ ఎంపికైన 40 మంది అభ్యర్థులకు దిశా నిర్దేశం చేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ముఖాముఖి మాట్లాడారు. కేంద్ర సర్వీసుల్లోకి ఎంపికైన అభ్యర్థులు తరతమ భేదాలు లేకుండా అకింత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు బాలలత, డైరెక్టర్ విజయరాణి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ - యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని ఓ వ్యక్తిని (50) రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ చుక్కలఫుల్ షర్టు, లోపల లైట్ పింక్ కలర్ ఫుల్‌షర్టు, వైట్ బ్లాక్ చెక్స్ గల నైట్ ప్యాంట్ ఉంది. కుడిచేతిపై హనుమాన్ టాటూ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో మహాపడిపూజ



మహాపడిపూజలో పాల్గొన్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: కవాడిగూడ రాజ్‌కుమార్ టెంట్ హౌస్ వద్ద శనివారం అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి నీలం వేణు యాదవ్ ఆధ్వర్యంలో మహాపడి భక్తి శ్రద్ధలతో జరిగింది. అయ్యప్పస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, నాయకులు శేరుపల్లి గణేష్, అనిల్‌తో పాటు అయ్యప్పస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాద వితరణతో పాటుఅన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

కాచిగూడ: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఎస్సీ మోర్చా శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికి అందేలా మోర్చాలు పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ, ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నేతలు ఎస్.కుమార్, కొప్పు భాష, క్రాంతి కిరణ్, బీజేపీ నేతలు ప్రకాష్‌రెడ్డి, ఓఎస్ రెడ్డి, శాంతారావు, డాక్టర్ ఎస్.గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న డాక్టర్ లక్ష్మణ్‌ను అభినందిస్తున్న బీజేపీ నేతలు

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కాచిగూడ: శివాజీనగర్‌లో వరద నీటికాలువ పక్కన నూతనంగా నిర్మిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలా రిటెయినింగ్ వాల్ నిర్మాణ పనులను శనివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



రిటెయినింగ్ వాల్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నేడు భార్యాబాధితుల సంఘ సమావేశం

చిక్కడపల్లి: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు భార్యాబాధితుల సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు బాలాజీరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భార్యాబాధితుల ఆవేదనను ప్రభుత్వానికి పార్లమెంటుకు తెలియజేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో కోడ్ కమిటీ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. మండలాలు, గ్రామాల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు సెల్ నం. 7093434730లో సంప్రదించాలన్నారు.

నేడు సాంప్రదాయ మాసోత్సవం

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం సాంప్రదాయ మాసోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

భైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలి



కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్



చిక్కడపల్లి సీఐ సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేస్తున్న సుఖీభవ అయ్యప్పసేవా భక్తసమాజం సభ్యులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నాస్తిక సమాజం అధ్యక్షుడు భైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి (టీఎంపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని టీఎంపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను బద్నామ్ చేసే విధంగా మాట్లాడడంతోపాటు అయ్యప్పస్వామిని అవమాన పరిచే విధంగా దుర్భాషలాడడం దురదృష్టకరమన్నారు. దేశంలో అన్ని మతాల వాళ్లు కలిసి మెలిసి జీవిస్తున్నారని, మంచి వాతావరణాన్ని చెడగొట్టి మనుషుల మధ్య అంతరాలు పెంచే విధంగా మాట్లాడిన భైరి నరేష్‌ను దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎంపీఎస్‌అధికార ప్రతినిధి ఇంజమ్ సాంబయ్య, మీడియా అధ్యక్షుడు మాదిదే నర్సింగరావు, జాతీయ ఉపాధ్యక్షులు తలారి నారాయణ, గ్రేటర్ అధ్యక్షులు కేశపాక నర్సింగ్, ఎర్రోళ్ల వెంకటేష్, తుల సీరామ్, సంపత్, గద్దల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: అయ్యప్ప స్వాముల, హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన భైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గౌట్ గణేష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం కాచిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరూ వ్యాఖ్యలు చేయకుండా ఉండే విధంగా నరేష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

పీడీ యాక్టు అమలు చేయాలి..

కాచిగూడ: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై పీడీ యాక్టు అమలు చెయ్యాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు డిమాండ్ చేశారు. బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పుర చమన్ వద్ద భైరి నరేష్ దిష్టి బొమ్మను బీజేపీ నేతలు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ చంద్ర, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలి

కవాడిగూడ: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హేతువాద సంఘం నాయకుడు భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని సుఖీభవ అయ్యప్ప సేవా సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు గురుస్వామి సాత్విక్‌శర్మ, పరధాన కార్యదర్శి మణిగండర్ అయ్యర్ ఉపాధ్యక్షుడు మల్కిరెడ్డి ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. అయ్యప్పస్వామిపై భైరి నరేష్ చేసిన అనుచిత వాఖ్యలను భేషరతుగా ఉపసంహరించుకోవాలని లేకపోతే తగిన గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. అయ్యప్ప స్వామి పై అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం సుఖీభవ సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు ర్యాలీగా వచ్చి చిక్కడపల్లి సీఐ సంజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ భైరి నరేష్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద వందలాది మంది అయ్యప్పస్వాములు రాస్తారోకో చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుఖీభవ అయ్యప్పసేవా సమాజం సభ్యులు రజని, కామేష్, ఉమేష్, గద్దె, శ్రీనివాస్, అనిల్, దేవేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, ఓబీసీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు చిత్రకుమార్ గౌడ్, అయ్యప్పస్వాములు భక్తులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గారె వెంకటేష్ మాదిగ



కాచిగూడలో నరేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

డాక్టర్ నిరంజన్ రెడ్డికి నివాళి



డాక్టర్ నిరంజన్ రెడ్డికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సి. వీరేందర్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సైకాలజిస్టు డాక్టర్ సి.వీరేందర్ కార్యాలయంలో శనివారం క్లినికల్ సైకాలజిస్టు, ప్రొఫెసర్ డాక్టర్ కె. నిరంజన్ రెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేందర్ మాట్లాడుతూ.... మానసిక సమస్యలపై అవగాహన కల్పించిన గొప్ప వ్యక్తి నిరంజన్ రెడ్డి అని సైకోథెరపీని బహుళ ప్రాచీనంలోకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో మొదటి సారిగా వైద్యపరమైన మనోవిశ్లేషకుడిగా నిరంజన్‌రెడ్డి మంచి గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ ఆచార్య, డాక్టర్ అంజన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ కట్

- తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడిన విద్యార్థులు



ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు కనెక్షన్ కట్‌చేశారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరుగుదొడ్లలో నీటి సరఫరా నిలిచిపోవడంతో గతరెండు రోజులుగా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉపాధ్యాయులు పలుమార్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోక పోవడంతో విద్యార్థులు శనివారం మధ్యాహ్న భోజనం చేయకుండా అలాగే ఉండిపోయారు. ఈ విషయమై స్కూల్ చైర్మన్ అనిల్‌చారి విద్యుత్ అధికారులతో మాట్లాడినప్పటికీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్ స్కూల్‌కు వచ్చి విద్యుత్ శాఖ డీఈ కమలాకర్‌తో మాట్లాడి విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.

వైద్యుల నియామకంపై హర్షం

నల్లకుంట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన 969 మంది వైద్యులను నియమించడం పట్ల తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ముఖ్య మంత్రి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.